క్లుప్తంగా

ముస్లిం మైనార్టీల పక్షపాతి సీఎం జగన్



పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని, వారి సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షుడు అయుబ్ ఖాన్ అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో పెడనలోని కట్లపల్లి, బిస్మిల్లా నగర్ మసీదులలో 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని కరపత్రాలను పంపిణీ చేశారు. అయుబ్‌ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా ముస్లింలు సీఎం వైఎస్ జగన్‌కు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. మున్సిపల్ కౌన్సిలర్ బాబూలాల్, పెడన పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జి మతీన్‌ఖాన్, షేక్ నూరుద్దీన్, మైనార్టీ నాయకులు అబ్దుల్ నూరుద్దీన్, కలాం, సత్తారి, పార్టీ నాయకులు కోమట్ల అనిల్ పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి చందనోత్సవం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి చందనోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీహరి నేతృత్వంలో శాస్త్రోక్తంగా కుంకుమార్చన, ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షించారు. పూషడపు శివ సత్యవతి, సంధ్య, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



కోనేరుసెంటర్: మండల పరిధిలోని చిన్న పోతేపల్లిలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ టీహెచ్ఆర్ పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలోని 10 మంది గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను వారి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీపావని, కరుణ, శివపార్వతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరి అన్నారు. శుక్రవారం గరిశపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి పౌష్టికాహారం కిట్లు అందజేశారు. కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యురాలు మిధున మహిళలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వైభవంగా వసంతోత్సవం



బంటుమిల్లి: గంగానమ్మ (నెల్లలమ్మ) జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం మేళతాళాలతో ఘటాలను ఊరేగించారు. సాయంత్రం భక్తులు పసుపు, కుంకుమ కలిపిన నీళ్ల బిందెలతో ఊరేగింపు చేసి చల్లుకుంటూ వసంతోత్సవంలో పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన కారు స్వాధీనం



బంటుమిల్లి: పెందుర్రు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో శుక్రవారం గుర్తించారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ములపర్రు పంచాయతీ శివారు రామన్నమోడి గ్రామానికి చెందిన తమ్ము లక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. లక్ష్మయ్య స్వగ్రామం నుంచి నిత్యావసర వస్తువుల కోసం ద్విచక్ర వాహనంపై బంటుమిల్లి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అతని కుమారుడు ఏసు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎ. పైడిబాబు కేసు నమోదు చేసి విచారణ చేశారు. విచారణలో హైదరాబాద్‌కు చెందిన కారుగా గుర్తించి కారు యజమానికి ఫోన్‌చేసి కారును రప్పించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అండగా ఉండి.. ఆశీర్వదించండి

- పింఛన్లు ఇంటి వద్దకే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం
- అన్ని పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ
- జోగి రాజీవ్
- నూతన పింఛన్ల పంపిణీ



నూతనంగా మంజూరైన పింఛన్లను అందజేస్తున్న రాజీవ్, వాణి, చారుమతి, నాగకుమారి తదితరులు

పెడన: అన్నివర్గాల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు జోగి రాజీవ్ అన్నారు. పింఛన్లను సైతం ఇంటివద్దకే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నకు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. మండల, పట్టణ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పెడన వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ఎంపీపీ రాజులపాటి వాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతితో కలిసి పంపిణీ చేశారు. మండల పరిధిలోని 164మందికి, పట్టణ పరిధిలోని 85 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. జోగి రాజీవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచన చేస్తూ పాలన చేస్తున్న జగనన్నను మనం ఎప్పటికీ మరవకూడదన్నారు. ఆయనకు అండగా అందరం ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు రాజులపాటి అచ్యుతరావు, గరికపాటి రామానాయుడు, కొండవీటి నాగబాబు, దావు భైరవలింగం, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్ లీడర్ బళ్ల గంగయ్య, బండారు మల్లి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కోడూరు మండలంలో 157 కొత్త పెన్షన్ల పంపిణీ..

కోడూరు: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 157 మంది లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ పాండురంగారావు తెలిపారు. మంజూరైన పెన్షన్ల నగదును సంబంధిత వలంటీర్లు లబ్ధిదారులకు అందించారని చెప్పారు. కోడూరు 1, 2, 3 సచివాలయాల పరిధిలో 37, లింగారెడ్డిపాలెంలో 22, మందపాకలలో 17, పిట్టల్లంకలో 12, రామకృష్ణాపురంలో ఆరు, సాలెంపాలెంలో 16, ఉల్లిపాలెంలో 13, విశ్వనాథపల్లిలో తొమ్మిది, వి.కొత్తపాలెంలో 25 మందికి కొత్త పెన్షన్లు అందించారని చెప్పారు. ఆయా సచివాలయాల పరిధిలో మరో 193 మందికి పెన్షన్ల మంజూరుకు ఆమోదం లభించిందని, వీరికి రెండు రోజుల్లో పింఛన్ నగదును అందిస్తామని చెప్పారు.

జన సంక్షేమమే లక్ష్యం..

గూడూరు: జన సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని జోగి రాజీవ్ అన్నారు. గూడూరు మండలంలో కొత్తగా మంజూరైన సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీపీ సంగా మధు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌లతో కలిసి రాజీవ్ లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేసి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పర్ణం పెదబాబు, తలుపుల వెంకట కృష్ణారావు, గొరిపర్తి రవికుమార్, కారుమంచి కామేశ్వరరావు, ఫైజుల్ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో 316 పింఛన్లు మంజూరు..

మోపిదేవి: మండలానికి కొత్తగా 316 సామాజిక పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ రామలింగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కొత్తవాటితో కలుపుకుని మొత్తం 6,301 పింఛన్లు మండలానికి కేటాయించారని చెప్పారు. కోసూరువారిపాలెంలో సర్పంచ్ కోసూరు అనూష చేతుల మీదుగా కొత్తగా మంజూరైన 9 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. నాగాయితిప్పలో సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు కొత్తగా మంజూరైన 12 మంది లబ్ధిదారులకు అందజేశారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: మండలానికి నూతనంగా 150 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో చల్లపల్లిలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో మంజూరైన 37 నూతన పింఛన్లను పంపిణీ చేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మీ, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండలానికి కొత్తగా మంజూరైన 141 పింఛన్లను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు జోగి రాజీవ్ అందజేశారు. ఎంపీపీ వెలివెల చినబాబు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, సర్పంచ్‌లు బి. రమేష్, బి. చంద్రశేఖర్, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ స్వర్ణభారతి మాట్లాడుతూ ఇంకా 153 దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని, విచారణ అనంతరం అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు.

ఇంట్లో ఇద్దరికి పింఛన్లు వస్తున్నాయి



నా భర్త శ్రీనివాసరావు దివ్యాంగుడు. నాకు ఇద్దరు సంతానం. పెద్దవాడు ముఖేష్ పెడన బీజీకే జెడ్పీ హెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. వీడు కూడా దివ్యాంగుడే. ఇంట్లో ఇద్దరికి పింఛన్లు ఇవ్వడం కుదరదని గతంలో పేర్కొనడంతో దరఖాస్తు చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక ఇంట్లో ఎంత మంది దివ్యాంగులుంటే అంత మందికి పింఛన్లు ఇస్తారని చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నాం. మా వారికి, మా అబ్బాయికి కూడా దివ్యాంగుల పింఛన్లు వస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

–మాదెం భూలక్ష్మి, కొంకేపూడి

చాలా సంతోషంగా ఉంది



ఆలస్యమైనా వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. నా భర్త శివయ్య ఏడాది కిందట చనిపోయారు. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా. అప్పటి నుంచి ఎదురుచూశా. ఎక్కడో ఏదో పొరబాటు జరగడం వల్ల ఆలస్యమైంది. ఇక రాదనుకున్నా. ఇప్పటికి పింఛను వచ్చింది. మొదటి నెల నాయకుల చేతుల మీదుగా తీసుకున్నా. ఆ తరువాత నెల నుంచి ఇంటికి తీసుకువచ్చి ఇస్తారని చెప్పారు. చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– నారగాని వెంకటేశ్వరమ్మ, 16వ వార్డు, పెడన

మూగజీవాల తాగునీటి సమస్య పరిష్కారం

పేర్ని కిట్టు



చెరువు తవ్వకం పనులను ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: బందరుకోట ప్రాంతంలోని వేలాది పశువులకు తాగునీటిని అందించేందుకు చెరువును తవ్వించటం వల్ల వాటి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 21వ డివిజన్ బందరుకోటలో సుమారు ఆరు ఎకరాల్లో పశువుల తాగునీటి కోసం చెరువు తవ్వకం పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బందరుకోటలో దాదాపు 12 వేలకు పైగా పశువులు ఉన్నాయన్నారు. వీటి పెంపకంపై ఆధారపడి ఈ ప్రాంత ప్రజలు జీవనం సాగిస్తున్నారన్నారు. పశువులు ఈ ప్రాంతంలో ఉన్న కాలువలు, డ్రెయిన్లలోని నీటినే తాగుతున్నాయని చెప్పారు. పశువుల తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో ఈ ప్రాంతంలో ఆరు ఎకరాల భూమిలో చెరువు తవ్వుతున్నామన్నారు. చెరువు తవ్వకం పూర్తయితే పశువుల తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. చెరువు లేకపోవడంతో వేసవి కాలంలో పశువులు తాగునీటికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. చెరువు తవ్వకంతో పాటు సమీపంలోని శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మన్నే శారద, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి మన్నే శేషారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కార్పొరేటర్లు ఐనం తాతారావు, పల్లి శేఖర్, శ్రీరాం చిన్నా, మిరియాల నాగబసవపూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీలు బడే భానుతేజ, షేక్ మొహమ్మద్‌సాహెబ్, చిత్తజల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకే తిరిగి పట్టం కడదాం

మంత్రి జోగి రమేష్



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: ప్రజా సంక్షేమం కోసం అనుక్షణం పరితపిస్తూ సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తిరిగి పట్టం కడదామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నిడమర్రు సచివాలయం-2 పరిధిలోని పెదగొల్లపాలెం, తాడివెన్ను, నిడమర్రు, కాపుటూరు, దళితవాడల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ 14 ఏళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలకు కనీసం పదిపైసలు మంచి చేయని చంద్రబాబును ప్రజలెవ్వరూ నమ్మరాదని చెప్పారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మొసలి కన్నీరు కార్చే చంద్రబాబు లాంటి వారిని నమ్మితే మన జీవితాలను చీకటిమయం చేస్తారన్నారు. తాను అధికారంలో ఉండగా ఏనాడైనా ప్రజల గురించి ఆయన పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మేలు జరగాలన్నా, భవిష్యత్ తరాలకు మంచి భవిష్యత్ ఉండాలన్నా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. తీరప్రాంతంలో నివశించే మత్స్యకారులకు, అక్కచెల్లెమ్మలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను మంత్రి వివరించారు.

నూతన ఫింఛన్ల పంపిణీ..

మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంత్రి స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో నూతనంగా మొత్తం 323 పింఛన్లు మంజూరుకాగా శుక్రవారం మంత్రి చేతుల మీదుగా 124 మందికి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఒకటో తేదీన వేకువజామునే ఇంటి తలుపు తట్టి మరీ పింఛన్లు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని చెప్పారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, మండల కన్వీనర్ వెంకట్రాజు, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, కాపు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి. మహేష్, జె. భూపతిరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, అధికారులు పాల్గొన్నారు.

భక్తితో సామూహిక కుంకుమ పూజలు



బ్రహ్మపురంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



గణపేశ్వరంలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



కొక్కిలిగడ్డలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

గణపేశ్వరం(నాగాయలంక): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని దేవదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ అనువంశిక ధర్మకర్తల ఆధ్వర్యంలో స్థానిక దుర్గా, గణపేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం కనకదుర్గమ్మ వారికి 300 మంది సువాసినీలు పీటలపై కూర్చుని సామూహిక కుంకుమ పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి, నాగవెంకట సాయిశర్మ బ్రహ్మత్వంలో తొలుత ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్ర మూర్తి (రాంబాబు), అరుణ దంపతులచే ఏకాదశ శ్రీసూక్త విధానంతో 21 రకాల పూజా ద్రవ్యాలతో అమ్మవారికి మహా అభిషేకాలు సంప్రదాయబద్ధంగా జరిపారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పెడన: బ్రహ్మపురం రామలింగ చౌడేశ్వరి అమ్మవారి భజన గుడిలో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా దేవాంగ భక్త బృందం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. 125 మంది మహిళలు సామూహిక వ్రతాల్లో పాల్గొని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత భక్తులు బ్రహ్మపురంలోని మఠం గుడి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి రామలింగ చౌడేశ్వరి అమ్మవారి భజన గుడికి చేరుకొని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి క్రోవి పార్థసారథి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం మహిళలు సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు.

చల్లపల్లి: స్థానిక హరిహర పుత్ర అయ్యప్ప క్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు అన్నవరపు పాండురంగారావు గురుస్వామి పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రి మాలికాపురోత్తమకు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగానమ్మ సంబరాలు ప్రారంభం



సంబరాలను ప్రారంభిస్తున్న బొర్రా దుర్గాభవానీ, బొర్రా విఠల్, భక్తులు



గంగానమ్మ ఆలయం వద్ద వేసిన అమ్మవారి ముగ్గు

మచిలీపట్నంటౌన్: జిల్లా ప్రభుత్వాస్పత్రి సమీపంలోని గంగానమ్మతల్లి ఆలయం వద్ద గంగానమ్మ సంబరాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాలు సంబరాలు జరుగుతాయని దేవాలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం ఉదయం గుడి ముందు వేసిన అమ్మవారి ముగ్గు వద్ద భక్తులు టెంకాయలు కొట్టి సంబరాలను ప్రారంభించారు. అమ్మవారి ఆలయంలోని దేవతామూర్తుల ప్రతిమలను ఎంయూడీఏ చైర్మన్ బొర్రా దుర్గాభవానీ, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ తీసుకువచ్చి బండిపై ఉంచారు. బండిపై ఉన్న విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ నగరంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

బంగారు కాయిన్ బహూకరణ



ఉత్తరచిరువోలులంక (మోపిదేవి): పాలకేంద్రంలో పాలు పోస్తున్న సభ్యుడు ఆర్. రాజారావు కుమార్తె వివాహానికి కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు పథకం కింద గోల్డ్ కాయిన్ అందజేశారు. పాలకేంద్రం అధ్యక్షుడు రెడ్రౌతు వెంకటరమణ చేతుల మీదుగా గోల్డ్‌కాయిన్‌ను పెండ్లికుమార్తెకు శుక్రవారం అందించారు. జిల్లా యూనియన్ ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ గొళ్ల పూర్ణమల్లికార్జునరావు, సూపర్‌వైజర్ ఎం. వరప్రసాద్ పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహనా ర్యాలీ

కృత్తివెన్ను: జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పల్లెపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నేత్ర దానంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కంటి ప్రాధాన్యతను, నేత్రదానం అవసరాన్ని ఉపాధ్యాయులు సూర్యప్రకాష్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

కోడూరు: కోడూరు 1, 2, 3 సచివాలయాల పరిధిలో పంచాయతీ అధికారులు శుక్రవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. నాయుడుపేట నుంచి తూర్పువైపు వరకు ఉన్న ప్రధాన మురుగు డ్రెయిన్‌లో పంచాయతీ కార్మికులు దోమల నివారణ మందును పిచికారీ చేశారు. మెరకగౌడపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, సంతమార్కెట్, వీవర్స్ కాలనీ, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లోని ప్రధాన రహదారులకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రం చేశారు. డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, సిల్ట్‌ను తొలగిస్తున్నామని ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం తెలిపారు.

పోషకాహారం ప్రాముఖ్యతను గుర్తించండి

గూడూరు: గర్భిణులు, బాలింతలు పోషకాహార ప్రాముఖ్యతను గుర్తించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బందరు సీడీపీఓ గ్లోరి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గూడూరు మండలం మల్లవోలు సెక్టారులోని గాంధీనగరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిశువులు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జన్ను రేవతి, సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని భోగాది వెంకటరెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో ఆదిలక్ష్మీదేవి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభమవుతాయని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 4వ తేదీ మధ్యాహ్నం 10.36 గంటలకు ఆదిలక్ష్మి నూతన శిల విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర స్థాపన జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు విగ్రహం యాగశాల ప్రవేశం, దీక్షాధారణ, అంకురారోపణ, కలశ స్థాపన నిర్వహిస్తామని చెప్పారు. 3న నిత్య పూజలు, దీక్షాహోమాలు, 9 గంటలకు చండీహోమం, మధ్యాహ్నం 2 గంటలకు గ్రామంలో అమ్మవారి ఊరేగింపు జరుగుతాయన్నారు. 4న విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు.

పక్షి స్థావరాల ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం

గూడూరు: వ్యవసాయ క్షేత్రాలలో పక్షి స్థావరాల ఏర్పాటుతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సేంద్రియ సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథిరావు అన్నారు. తరకటూరులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొలాల్లో కొంగలు, కాకులు, నీటి కోళ్లు, వంటి మిత్ర పక్షులు పురుగులను ఏరుకుని తింటూ పంటలను చాలా వరకు చీడపీడల నుంచి కాపాడతాయని చెప్పారు. మిత్ర పక్షులు మన పొలాలకు రావాలంటే గట్ల మీద, పరిసరాల్లోని చెట్లను పెరగనివ్వాలని, తద్వారా మిత్ర పక్షులు గూళ్లు ఏర్పాటు చేసుకుని మన పంటలను అనుక్షణం కాపలా కాస్తాయన్నారు. ఒక కొంగ 20 నిమిషాల్లో 50 పురుగులను తింటూ పురుగుల ఉధృతిని 73 శాతం తగ్గిస్తుందన్నారు. పంటల సాళ్ల మధ్య అడుగున్నర దూరం ఉన్న పొలాల్లో కంటే 2 అడుగుల దూరం ఉన్న పొలాల్లో పక్షులు స్వేచ్ఛగా తిరుగుతూ పురుగులను సంహరిస్తాయని వివరించారు. రైతులు పక్షి స్థావరాల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు కల్పించి ప్రయోజనాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి కళాశాల ఫీజు చెల్లింపు

చల్లపల్లి: పితృవియోగంతో విద్యాభ్యాసానికి ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థినికి అవనిగడ్డకు చెందిన చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ పూర్వ విద్యార్థుల బృందం ఆర్థిక సాయం అందజేశారు. చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీకి చెందిన మెండు ఝాన్సీ ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుకునేందుకు శుక్రవారం స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాలకు చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ వచ్చి రూ.14 వేల ఫీజు చెల్లించారు. కుందేటి రత్నాకరరావు, కూనపరెడ్డి శ్రీను, కమ్మిలి ప్రసాద్, అలపర్తి గోపాలకృష్ణ, బండే శ్రీను, మోపిదేవి శ్రీను, ప్రిన్సిపాల్ దుట్టా శివప్రసాద్ పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై సమగ్ర విచారణ

గూడూరు: మృతిచెందిన వ్యక్తుల ఓట్లను తొలగించడానికి ముందు సమగ్ర విచారణ చేస్తున్నామని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. శుక్రవారం కంచాకోడూరు, మల్లవోలు గ్రామాల్లో మృతిచెందిన ఓటర్ల ఇంటింటికీ తహసీల్దార్ వెళ్లి సమగ్ర విచారణ చేశారు. ఆయన మాట్లాడుతూ కంచాకోడూరులో 22 మంది మృతిచెందినట్లు బీఎల్ఓలు నివేదిక ఇచ్చారన్నారు. వివిధ రాజకీయ పార్టీలు మండలంలోని 161 ఓట్లపై అభ్యంతరం వ్యక్తం చేశారని, వీటిపై కూడా పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తామని చెప్పారు.